# దయ్యం



సుబ్బారావు గడియారం వైపు చూశాడు...

అది పదకొండు చూపిస్తోంది!

'సావిత్రమ్మ వస్తుందా? వస్తే ఎలా ఉంటుంది? తను చూసి భయపడకుండా ఉండగలడా?' అనుకున్నాడు.

అతనికి చిన్నప్పుడు తను చూసిన 'ఆమె ఎవరు?' సినిమా గుర్తొచ్చింది. ఆ సినిమాకు అతను సెకండ్ షోకి వెళ్లాడు. సగం సినిమా అయ్యాక భయంతో బయటకు వచ్చేశాడు. అప్పట్నుంచీ రాత్రుల్లో ఒంటరిగా వెళ్లడానికి భయపడేవాడు. ఆ సినిమాలో అర్ధరాత్రి ఒంటరిగా ప్రయాణిస్తున్న జగ్గయ్య కారులో జయలలిత ఎక్కడం, శ్మశానం దగ్గర ఆమె దిగడం, 'ఓ...

నా రాజా!' అంటూ పాట పాడటం తరచుగా గుర్తొచ్చి భయంతో వణికిపోయేవాడు. వయసు పెరిగేకొద్దీ అతనిలో అటువంటి భయాలన్నీ క్రమంగా పోయాయి. అందుకే యీరోజు సావిత్రమ్మను చూడాలని ధైర్యంగా యీ ఇంట్లో పడుకున్నాడు.

'సావిత్రమ్మ ఇంకా రాదేం? మానస అబద్ధం చెప్పిందా? ఆ అమ్మాయి అటువంటిది కాదు. చాలా మంచి అమ్మాయి. మరీ చిన్నపిల్లా కాదు. ఇంటర్ చదువుతోంది. అయితే తల్లి పోయిన షాక్ వల్ల ఏదో మానసిక వ్యాధికి లోనై చనిపోయిన తల్లి రోజూ రాత్రిపూట తన దగ్గరకు వచ్చి మాట్లాడిపోతున్నట్లు ఆమె భ్రమపడుతోందని తన అనుమానం. ఆ విషయం నిరూపించాలనే తను యిక్కడికి వచ్చాడు.

మానసను, ఆమె తమ్ముణ్ణి కూడా యిక్కడే పడుకోమంటే ఆ అమ్మాయి వినలేదు. ఇంట్లో తామిద్దరు తప్ప యింకెవరు ఉన్నా తన తల్లికి కోపం వస్తుందనీ, ఆమె కోపం తను చూడలేననీ... అంది. తను వాళ్ళిద్దరినీ తన ఇంట్లో పడుకోమంటే అందుకు ఒప్పుకుంది' అనుకున్నాడు.

పన్నెండు గంటలు కావస్తోంది!

'అవును... సినిమాల్లో సరిగ్గా పన్నెండు గంటలకే దయ్యం శ్మశానం నుండి బయలుదేరుతుంది. 'దయ్యాలు నిజంగానే అలా పంక్చువాలిటీ పాటిస్తాయా? లేక, అది సినిమావాళ్ళ కల్పనా?' అని తను చాలాసార్లు ఆలోచించాడు. జవాబు ఇప్పటికీ దొరకలేదు తనకి. ఒకవేళ సినిమావాళ్ళు చెప్పిందే నిజమైతే సావిత్రమ్మ ఇప్పుడు బయలుదేరాలి. మరో పది నిమిషాల్లో నా ముందుండాలి!' అనుకున్నాడు.

అంతవరకూ చదివిన వారపత్రిక ప్రక్కన పెట్టి, టీవీ ఆన్ చేశాడు సుబ్బారావు.

పాత బ్లాక్ అండ్ వైట్ టీవీ అది. డిష్ కనెక్షన్ లేదు. దూరదర్శన్ ఛానల్‌లో ఏదో హారర్ సీరియల్ వస్తోంది. ఆసక్తిగా చూస్తూ ఉండిపోయాడు.

ఉన్నట్టుండి లోపల శబ్దం వినిపించింది.

ఉలిక్కిపడి లేచాడు సుబ్బారావు. లోపలి గదికి వెళ్లి స్విచ్‌బోర్డ్ ఎక్కడుందో వెతికి లైటు స్విచ్ ఆన్ చేసి చూశాడు.

ఎలుక..! అటూ ఇటూ పరిగెడుతోంది.

ఇంటిని పరిశీలనగా చూశాడు. ఇల్లంతా కలిపి రెండు గదులే! బాత్‌రూమ్ పెరట్లో ఉన్నట్లుంది. 'పాపం... పిల్లలకు రాత్రిపూట బాత్‌రూమ్ కెళ్లాలంటే ఎంత యిబ్బంది?' అనుకున్నాడు. అతనికి వాళ్ళపై ఎంతో జాలి కలిగింది.

ఆ గదిలో లైటార్పి బయటి గదిలోకి వచ్చాడు.

టీవీలో సీరియల్ పూర్తవడం గమనించి టీవీ ఆఫ్ చేసి గదిలోని లైటు కూడా ఆర్పి మంచంపై పడుకుని సావిత్రమ్మ గురించి ఆలోచించసాగాడు.

దాదాపు పదేళ్ల క్రితం సావిత్రమ్మ తన పిల్లలతో సుబ్బారావు ఎదురింట్లో చేరింది. అప్పుడు మానసకు ఎనిమిదేళ్లుంటాయి. ఆమె తమ్ముడు తేజకు రెండేళ్లు. ఆమె భర్త ఎవరో, ఏం చేస్తుంటాడో చాలారోజుల దాకా ఎవరికీ తెలియలేదు. తర్వాత తెలిసింది- ఆమె భర్త చనిపోయాడనీ, అతని ఉద్యోగం ఆమెకి యిచ్చి ఆ ఊళ్లో పోస్టింగ్స్ యిచ్చారనీ!

సావిత్రమ్మ చాలా అందంగా ఉండేది. ముఖం ఎంతో నిర్మలంగా ఉండేది. ఆమెను చూడగానే ఎలాంటివారికైనా గౌరవభావం కలిగేది. ఆమె ఉన్నచోటే తెలిసేది కాదు. ఆఫీసు, ఇల్లు తప్ప ఇంకెక్కడా కనిపించేది కాదు. ఇరుగుపొరుగు వాళ్ళతో చాలా తక్కువగా మాట్లాడేది. పిల్లలకు క్రమశిక్షణ, మంచీ మర్యాద నేర్పింది. వాళ్ళు తెలివిగలవాళ్ళే కాదు, కష్టపడి చదువుకునేవాళ్ళు కూడా. ఇంటిపని, బయటి పని ఆ పిల్లలు చాలా చురుకుగా చేసేవాళ్ళు. సుబ్బారావు కూతురు జలజ, మానస ఒకే క్లాసు చదువుతూండడంతో వాళ్ళిద్దరికీ మంచి స్నేహం కుదిరింది. అందువల్ల సుబ్బారావు కుటుంబంతో సావిత్రమ్మ స్నేహంగా ఉండసాగింది.

మూడు వారాల క్రితం సావిత్రమ్మ గుండెపోటుతో చనిపోయింది. ఆమె తరపు బంధువులు ఎవరో, ఎక్కడున్నారో ఎవరికీ తెలియదు. మానస తన మేనమామ అడ్రస్ మాత్రమే చెప్పగలిగింది.

సుబ్బారావు ఆయనకు టెలిగ్రామ్ యిచ్చి పిలిపించాడు. సావిత్రమ్మ అంతిమ యాత్రకు అన్ని ఏర్పాట్లూ సుబ్బారావే చేశాడు. పిల్లలను ఓదార్చడం మాత్రం ఎవ్వరివల్లా కాలేదు.

అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాక పిల్లలను ఏం చెయ్యాలనే సమస్య వచ్చింది.

మానస మేనమామ వాళ్ళని తనతో తీసుకెళతానని అన్నాడు. అయితే మరో రెండు నెలల్లో తన యింటరు చదువు పూర్తవుతుంది కనుక అంతవరకూ తాము ఆ ఊరిలోనే ఉంటామని మానస చెప్పింది. ఆమె తల్లి తాలూకు డబ్బులు ఆఫీసు నుంచి వచ్చేదాకా ఆ పిల్లలు ఊర్లో ఉంటే సులభంగా ఉంటుందని సుబ్బారావు కూడా అభిప్రాయపడ్డాడు. అంతవరకూ పిల్లలతో పాటు ఉంటానని వాళ్ళ మేనమామ చెప్పడంతో ఓ సమస్య పరిష్కారమైందని అందరూ సంతోషపడ్డారు.

అయితే వారంరోజుల తర్వాత పొలం పనులు ఉన్నాయంటూ ఆమె మేనమామ వెళ్ళిపోయాడు. మళ్ళీ సమస్య మొదటికొచ్చిందని బాధపడ్డాడు సుబ్బారావు. అప్పుడు అందరూ ఆశ్చర్యపోయేలా మానస ఓ షాకింగ్ న్యూస్ చెప్పింది. తన తల్లి రోజూ రాత్రిపూట తన యింటికి వస్తోందని, తెల్లారేదాకా తమకు తోడుగా ఉంటోందని చెప్పింది.

మొదట అందరూ కొట్టిపారేసినా రెండురోజుల తర్వాత మానస కొన్ని ఋజువులు కూడా చూపడంతో చాలామంది నమ్మారు. అప్పట్నుంచీ రాత్రి పది తర్వాత కాలనీలో మనుషుల సంచారం తగ్గింది. మానస యింటికి యిరుప్రక్కల ఉన్నవాళ్ళు యిళ్ళు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. కుర్రాళ్ళు సెకండ్ షోలకు వెళ్ళడం, అర్ధరాత్రి వరకు వీధుల్లో బాతాఖానీలు కొట్టడం మానేశారు.

కాలనీలో ప్రతిరోజు సాయంత్రం నుంచి ఓ మాదిరి స్తబ్దత ఆవహించడం గమనించాడు సుబ్బారావు. ఈ పరిస్థితి మార్చడానికి ఏదో ఒకటి చేయాలని నిశ్చయించుకున్నాడు. సాయంత్రం కాలనీలోని పెద్దలందరినీ సమావేశపరచి, మానస మానసిక ఆరోగ్య పరిస్థితి గురించి తన అనుమానం వివరించి, తను ఆరోజు రాత్రి మానస యింట్లో పడుకుని ఆమె చెబుతున్నది నిజమో, కాదో తేల్చుకోబోతున్నట్టు చెప్పాడు.

అతని నిర్ణయం విని చాలామంది అతన్ని వారించబోయారు...

తాము చిన్నప్పుడు చూసిన దయ్యాల గురించి కొందరు చెబితే, దయ్యాల ప్రభావాన్ని తాము కళ్ళారా చూశామని మరికొందరు చెప్పారు. ఒకరిద్దరు ఒక అస్పష్టమైన తెల్లని ఆకారం మానసం ఇంటివైపు వెళ్లడం తాము చూశామని చెప్పారు. చివరిగా సుబ్బారావు తన నిర్ణయం మార్చుకోదని తెలిశాక అందరూ అతనికి 'బెస్టాఫ్ లక్' చెప్పి వెళ్లిపోయారు.

ఆలోచనల్నుంచి తేరుకుని గడియారం వైపు చూశాడు... పన్నెండున్నర అయింది!

అతనికి బాత్‌రూమ్‌కి వెళ్లాలనిపించింది. లేచి వంటగదిలో ఉన్న లైటు స్విచ్ వేసి పెరటి తలుపు తెరిచాడు. రివ్వుమని ముఖానికి తగిలింది చల్లటి గాలి. వెంటనే వంటగది లోని బల్బు ఒక్కసారిగా కాంతివంతంగా వెలిగి ఆరిపోయింది.

'ఎందుకలా బల్బు మాడిపోయింది? హై ఓల్టేజి వల్లనా? లేక, దయ్యం ప్రభావం వల్లనా?' అనుకున్నాడు.

'ఈరోజు అమావాస్య కాబోలు!' అనుకున్నాడు- చుట్టూ ఉన్న చీకటిని చూస్తూ. అతనికి అంతగా గాలి వీస్తున్నా ఒళ్ళంతా చెమటలు పట్టాయి. అంతవరకూ ఉన్న ధైర్యం సడలిపోసాగింది.

'పెరట్లో లైటు ఉందో, లేదో? ఉన్నా స్విచ్‌బోర్డ్ ఎక్కడుందో ఈ చీకట్లో వెతకడం సాధ్యం కాదు. అలాగే ముందుకెళితే ఏ పామో, పురుగో కరిస్తే? వచ్చేటప్పుడు తన ఇంట్లోంచి టార్చిలైటు తెచ్చుకోవాల్సింది!' అనుకున్నాడు.

తిరిగి ఇంట్లోకి పోదామని వెనక్కి తిరగబోతూ ఎదురుగా కనబడుతున్న దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. ఏదో తెల్లని పదార్థం అరచేయి ఆకారంలో గాల్లో ఎగురుతోంది. అతని వెంట్రుకలు భయంవల్ల నిక్కబొడుచుకున్నాయి. నాలుక తడారిపోయింది.

వేగంగా ఇంట్లోకి వచ్చి తలుపులు వేసుకున్నాడు. హాల్లో ట్యూబ్‌లైటు వేసుకుని, చెప్పులు మంచం దగ్గర పెట్టుకుని పడుకున్నాడు. కొంతసేపు మనసులో ఆంజనేయ దండకం జపించుకుని, తర్వాత కళ్ళు మూసుకుని నిద్రకోసం ప్రయత్నించాడు. మరో అరగంటకు అతని ప్రయత్నం ఫలించింది.

ఆరు గంటలకు నిద్రలేచిన సుబ్బారావు- పెరట్లోకి వెళ్లి అక్కడి దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు.

ఓ తెల్లటి చీర అరచేయి ఆకారంలో కట్ చేయబడి దండేనికి వ్రేలాడదీయబడి ఉంది. ఆ చీరను చూసి రాత్రి తాను దయ్యంగా భావించి భయపడ్డాడని అర్థమైంది అతనికి.

•

ఏడు గంటలకి మానస, తేజ వచ్చారు.

"అమ్మ వచ్చిందా అంకుల్?" మానస కుతూహలంగా అడిగింది.

"లేదు... రాలేదు."

"రాలేదా? మీరు నిద్రపోయుంటారు అంకుల్!"

"రెండు గంటల వరకు నేను మెలకువగానే ఉన్నాను. దీన్నిబట్టి నువ్వు చెబుతున్నది అబద్ధమని తెలుస్తోంది."

"కాదు. ఇంట్లో మా బదులు మీరు ఉండటం చూసిన అమ్మకు కోపం వచ్చి ఉంటుంది. అందుకే వెళ్లిపోయుంటుంది. ఆ కోపంతో ఈరోజు వస్తుందో, రాదో?!" దిగులుగా ముఖంపెట్టి అంది మానస.

"రాకుంటేనే మంచిది. దయ్యంతో మాటలు, స్నేహం అసహజమైన చర్యలు. నువ్వు అటువంటి పనులు చెయ్యకూడదు."

"కాని, ఆమె దయ్యం కాదు అంకుల్... మా అమ్మ!" కన్నీళ్లతో అంది.

"మీ అమ్మ చనిపోయిందన్న విషయం నీకు తెలుసు. నీవు రోజూ చూస్తున్నది మీ అమ్మ ఆత్మ కావచ్చు, లేదా నీ భ్రమ కూడా కావచ్చు. ఇకపై ఇలాంటి ఆలోచనలకు, చర్యలకు స్వస్తి చెప్పు. ఒకవేళ నువ్వు చెప్పిందే నిజమైతే ఇకపై మీ ఇంటికి రావద్దని మీ అమ్మతో చెప్పు."

"కాని అమ్మను బాధించే పనులు నేను చేయలేను అంకుల్!" అంది ఏడుస్తూ.

"నీ ఖర్మ!" అని కోపంగా బయటకు నడవబోతూ చీర విషయం గుర్తొచ్చి, మానసను పెరట్లోకి తీసుకెళ్లి, "ఆ చీరను అంత ఎత్తులో ఎవరు వ్రేలాడదీశారు?" అని అడిగాడు.

"అది మా అమ్మ చీర అంకుల్! దాన్ని మేము తాకను కూడా లేదు."

ఆమెతో ఇంకేం మాట్లాడాలో అర్థంకాక తల పట్టుకున్నాడు సుబ్బారావు.

●

ఉదయం ఎనిమిది గంటలకు కాలనీలోని వారంతా సుబ్బారావు ఇంటిముందు గుమికూడారు- ఏం జరిగిందో తెలుసుకుందామని!

సావిత్రమ్మ రాలేదని, మానస గురించి తన అనుమానం నిజమైందని సుబ్బారావు చెప్పాడు. అయితే చీరను చూసి దయ్యమనుకుని తను భయపడిన విషయం మాత్రం వాళ్ళతో చెప్పలేదు.

"మానసను సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళదామా?" అన్నారు ఒకరు.

"ఎందుకండీ? ఎటూ ఇంకో నెలలో వాళ్ళ మేనమామ వస్తాడుగా! ఆయనతో విషయం చెబుదాం. ఆపైన వాళ్ళిష్టం!" మరొకరు అన్నారు. సుబ్బారావుతో పాటు అందరూ ఆ సూచనను సమర్థించారు.

చూస్తూండగానే మరో నెల గడచిపోయింది.

మానస ఇంటర్ చదువు పూర్తయింది. ఆఫీసు నుంచి సావిత్రమ్మకు చెందవలసిన డబ్బులు పిల్లలకు అందాయి...

పిల్లలకు పెన్షన్ కూడా మంజూరు అయింది.

●

ఆ రోజు ఉదయం పేపరు చదువుతున్న సుబ్బారావు దగ్గరికి మానస, తేజ వచ్చారు.

"అంకుల్! మేము ఈరోజు సాయంత్రం ట్రైనుకు మా నాయనమ్మ ఊరికెళ్తున్నాం!" అంది మానస.

"నాయనమ్మ దగ్గరికా? మీ మామయ్య తన ఊరికి తీసుకెళ్తానన్నారు కదా?" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

"అక్కడో చిన్న ప్రాబ్లమ్ వచ్చింది. అందువల్ల ప్లాను మారింది. మామయ్యను అడిగి నాయనమ్మ అడ్రసు తీసుకుని మా పరిస్థితి తెలుపుతూ ఉత్తరం రాశాను. మేము తనతో ఉండటానికి ఆవిడ ఒప్పుకుంది."

"వెరీగుడ్! మరి, ఈ విషయం మీ అమ్మకు చెప్పావా?"

"ఎలా చెప్పను? అమ్మ లేదుగా!"

"మీ అమ్మ రోజూ మీ ఇంటికి వచ్చి నీతో మాట్లాడుతుందిగా?!" వెటకారంగా అన్నాడు.

"అలా అని అబద్ధం చెప్పాను. అమ్మ చనిపోయాక నా కలల్లో తప్ప ఇంకెక్కడా కనిపించలేదు తను."

సుబ్బారావుకు ఒళ్ళు మండింది- ఆమె మాటలకు.

"మరి, ఎందుకలా చెప్పావు? నేను మీ ఇంట్లో పడుకుంటానని చెప్పినప్పుడైనా నాకెందుకు నిజం చెప్పలేదు? పెద్దవాళ్ళ దగ్గర ప్రాక్టికల్ జోక్స్ వేయకూడదని నీకు తెలియదా?" దాదాపు అరచినట్టే అన్నాడు.

మానస కళ్ళనీళ్లు పెట్టుకుంది. తర్వాత తమ్ముడితో పాటు వెళ్లిపోయింది.

సుబ్బారావుకు చాలా అవమానంగా అనిపించింది. అంత చిన్న అమ్మాయి చేత తను ఫూల్ కావడం జీర్ణించుకోలేకపోతున్నాడు.

సాయంత్రం అతని భార్య రేవతి వచ్చి, 'స్టేషన్‌కి వెళ్లి పిల్లలకు వీడ్కోలు చెబుదాం రమ్మ'ని పిలిచింది.

సుబ్బారావుకి వెళ్లాలనే ఉంది కాని, మానస మీద ఇంకా కోపం తగ్గలేదు అతనికి.

"మానసపై మీకు కోపంగా ఉందని నాకు తెలుసు. నాకు కూడా ఆమె మీద చాలా కోపం వచ్చింది. కూతురిలా చూసుకున్న మీతో కూడా అబద్ధం చెప్పడం సహించలేకపోయాను. ఇందాకే వెళ్లి మానసను కోప్పడ్డాను. అయితే ఆ అమ్మాయి చెప్పిన విషయం వినగానే నా మనసు కదిలిపోయింది" అంది రేవతి.

'ఏమిటా విషయం?' అన్నట్టు చూశాడు భార్య వైపు.

"ఈ రెండు నెలలూ తమతో ఉంటానన్న మేనమామ మానసతో అసభ్యంగా ప్రవర్తించాడట. ఆమె తండ్రి వయసున్న అతను మానస నిద్రపోతున్నప్పుడు నానా వికృత చేష్టలు చేశాడుట!"

బాధతో కళ్ళు మూసుకున్నాడు సుబ్బారావు... 'ఎందుకు ప్రపంచం ఇలా అయిపోతోంది? కామానికి వావి వరసలు లేవా? జాలి, దయ ఉండవా?' అనుకున్నాడు.

"ఏం చేయాలో తోచని పరిస్థితిలో తల్లి తమ్ముడి గురించి చెప్పిన చిన్ననాటి విషయాలు గుర్తొచ్చి ఒక ఉపాయం,ఆలోచించింది మానస. తన తల్లి రాత్రి తనతో వచ్చి మాట్లాడిందని అతనితో చెప్పింది. ఋజువులు కూడా సిద్ధం చేసుకుని అతనికి చూపింది. దయ్యాలున్నాయని గాఢంగా నమ్మే అతను భయంతో ఊరు వదిలి పారిపోయాడు. మేనమామ పొలం

పనులున్నాయని వెళ్లాడని అందరితో చెప్పడంతో- ఆమెకి తోడుగా పడుకోవడానికి మన కాలనీలోని మగాళ్ళు సిద్ధమయ్యారు. వాళ్ళ చూపుల్లో కోరిక, చేష్టల్లో లేకితనం అదివరకే గమనించిన మానస- తన మేనమామకు చెప్పిన కథే వాళ్ళకూ చెప్పిందట. అప్పట్నుంచీ ఎవరూ తన ఇంటివైపు రాకపోవడంతో ఈ రెండు నెలలూ తను నిశ్చింతగా గడిపానని నాతో అంది."

తను వాళ్ళింట్లో పడుకుంటాననగానే మానస కళ్ళల్లో కనిపించిన భయం గుర్తొచ్చింది సుబ్బారావుకు. 'ఓ కూతురిలా చూసుకున్న తనను చూసి కూడా భయపడిందంటే... మనుషులపై నమ్మకం ఆ అమ్మాయిలో ఎంతగా సడలిపోయిందో..?!' అనుకుని బాధపడ్డాడు.

"మరి, ఆ అమ్మాయి ఊరికెళితే అక్కడ మాత్రం రక్షణ ఉంటుందా? ఆమె నాయనమ్మ వయసు మళ్లినావిడ. ఆ మేనమామ అక్కడ మళ్లీ తగలడకుండా ఉంటాడా?" అని అడిగాడు భార్యను.

"అక్కడా అదే ఆయుధం ఉపయోగిస్తుంది అవసరమైతే! పదండి... టైమవుతోంది. వాళ్ళకు అంతా మంచే జరుగుతుందని ఆశిద్దాం. మీకోసం మేమున్నామని ధైర్యమిద్దాం... పదండి!" అంది రేవతి.

సుబ్బారావు రేవతితో బయలుదేరాడు.

"మానవ రూపంలో ఉన్న దయ్యాల నుంచి కాపాడుకోవటానికి దేవత లాంటి అమ్మను దయ్యంగా మార్చాను. తండ్రి లాంటి మీతో అబద్ధం చెప్పాను. ఆ దేవుడు నన్ను క్షమించడు!" ఏడుస్తూ అంది మానస- స్టేషన్‌లో.

"ఊరుకోమ్మా! జరిగినదంతా మన మంచికే అనుకో! ఇక్కడున్నప్పుడే నీ మేనమామ వికృతస్వరూపం బయటపడినందువల్ల అక్కడికి వెళ్లి ఇరుక్కోకుండా తప్పించుకున్నావు. మీ అమ్మ మంచిది కాబట్టే ఈ లోకంలో లేకపోయినా నీకు ఉపయోగపడింది. నీవు ధైర్యంగా ఉండు. అంతా మంచే జరుగుతుంది. నీకే అవసరమొచ్చినా మాకు ఫోన్ చెయ్యి. అంకుల్ బయలుదేరి వస్తారు. మీకు మేమున్నాము" అంది రేవతి మానస భుజం తట్టి ధైర్యం చెబుతూ.

సుబ్బారావు మాత్రం కళ్ళు మూసుకుని నిలబడివున్నాడు...

'భగవంతుడా... అమాయకులైన ఈ పిల్లల్ని కాపాడు!' అని దేవుణ్ణి వేడుకుంటున్నాడు.

●

'నవ్య' వారపత్రిక ... 11 అక్టోబర్' 2006